క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ

దేవరకద్ర: మేజర్ పంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలకు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. పట్టణంలో గృహ నిర్మాణాలను ఈఓ సీత్యానాయక్, పంచాయతీ సిబ్బంది తనిఖీ నిర్వహించారు. అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని ఈఓ సూచించారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

స్టేషన్ మహబూబ్‌నగర్: పట్టణ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేశావత్ రమేష్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్, అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్ శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. యువజన కాంగ్రెస్ విభాగాన్ని బలోపేతం చేయాలని కోరారు.

మాయమాటలతో బీఆర్‌ఎస్ మోసం

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ విమర్శించారు. ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఆయన వెంట నరేందర్, తిరుపతి, శివ,అంజి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

జడ్చర్ల టౌన్: అధిక శ్రావణమాసం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని సంతోషిమాతను లక్ష గాజులతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేసి, భజనలు, కీర్తనలు ఆలపించి నైవేద్యం సమర్పించారు. సకలదేవతల ఆలయంలో వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికా ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

మిడ్జిల్: ఉపాధి హామీ పథకం ద్వారా 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు పండ్ల తోటల సాగుకు 2023–24 గాను దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిలక్ష్మి సూచించారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు బోరు బావి, జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, సపోట, అర ఎకరం డ్రాగన్ ఫ్రూట్స్ మాత్రమే వర్తిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే..

కోయిల్‌కొండ: రైతుల సంక్షేమం కోరేది సీఎం కేసీఆర్ అని జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకిళ్ల రైతువేదికలో నిర్వహించిన రైతుసదస్సులో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఒక రైతు బిడ్డ అయినందున రైతుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, రైతులకు 24గంటల విద్యుత్, రైతుబంధు, బీమా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, భీంరెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రఘునాథ్ పాల్గొన్నారు.

వర్షాలు తగ్గాక రోడ్ల మరమ్మతు



జడ్చర్ల: కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కిష్టారం–అంబటాపూర్ మధ్య దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

'మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపాలని, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గడియారంచౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో నాగ, కుకి జాతి తెగలకు రక్షణ కల్పించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి, ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సుందర్‌పాల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు చేరుతున్న వరద



ఉడిత్యాల–సూరారం వద్ద ఏర్పాటు చేసిన కంచె



అడ్డాకుల మండలం శాఖాపూర్ చెరువులోకి వస్తున్న వరద

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ చెరువుకు ఎగువ నుంచి వరద నీళ్లు వచ్చి చేరుతున్నాయి. లోక సముద్రం నుంచి ఉన్న పాటు కాల్వ నిండుగా ప్రవహిస్తూ శాఖాపూర్ చెరువులోకి నీళ్లు వెళ్తున్నాయి. పెద్దవాగులో పెద్దమునుగల్‌ఛేడ్ వద్ద స్వల్ప వరద వస్తుంది. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగులో కందూర్ శివారులో స్వల్పంగా వరద మొదలైంది. మూసాపేట చౌట చెరువులోకి కాల్వల ద్వారా వరద వస్తుంది.

బాలానగర్: మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. ప్రధానంగా రంగారెడ్డి జిల్లా కొందుర్గు, చౌదర్‌గూడెం, ఫరూక్‌నగర్ మండలాల్లో కుర్తుస్తున్న వర్షాలతో దుందుభీనది నిండుగా ప్రవహిస్తుంది. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ రాజేశ్వరి ఉడిత్యాల–సూరారం గ్రామాలకు రాకపోకలు నిలుపుదల చేశారు.

మల్క చెరువు తూముకు గండి

మహమ్మదాబాద్: వర్షాలకు మల్క చెరువు తూము దగ్గర మట్టి పేరుకుపోయి గండి పడింది. తహశీల్దార్ ఆంజనేయులు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. దీంతో ఎలాంటి ప్రమాదం లేదని రైతులకు తెలిపారు.



అలుగు పారుతున్న సాలానగర్ ప్రాజెక్టు

అలుగు పారిన సాలానగర్

గండేడ్: మూడు రోజుల నుంచి కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ క్రమంలోనే మండలంలోని సాలానగర్ ప్రాజెక్టు అలుగు పారింది. ఈ ప్రాజెక్టు మత్తిడి దూకడంతో వెన్నచేడ్ చెరువులోకి భారీగా వరద చేరింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మల్క చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకద్ర: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 8.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాకాలం ప్రారంభమైన తరువాత ఇదే పెద్ద వర్షం.

లీకేజీ పూడ్చిన రైతులు

నవాబుపేట: మండల కేంద్రంలో పెద్ద చెరువుకు తూము గండం ఎదురైంది. గమనించిన రైతులు లీకేజీ పూడ్చి వేయటంతో నీళ్లు నిలిచాయి.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో ఉన్న ఎస్సీ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వసతిగృహాలలో తాము సర్వే చేయగా చాలా సమస్యలు ఉన్నాయని తేలిందని, పాఠశాలలు తెరిచి నెల రోజులు గడిచినా విద్యార్థులకు సరిపడా నోట్ బుక్కులు ఇవ్వలేదని తెలిపారు. దుస్తులు, ప్లేట్లు, గ్లాసులు, పెట్టెలు, బెడ్స్ ఇంతవరకు ఇవ్వలేదని, నాణ్యమైన భోజనం ఎక్కడా పెట్టడం లేదని చెప్పారు. మిడ్జిల్, హన్వాడ మండలాల్లో సొంత భవనాలు నిర్మించాలని, బాలికల వసతిగృహాల్లో నైట్ వాచ్‌మన్ నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఆది విష్ణువర్ధన్, వేణు, కురుమూర్తి, బచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి'

బాలానగర్: బీఆర్‌ఎస్ మండల నాయకులపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, వాస్తవాలు తెలుసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకటచారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మారెడ్డి 4ఎకరాల భూమిని ఇచ్చిన మాట వాస్తవమే అన్నారు. కానీ 2011 ఏప్రిల్ 30న అందులో తిరిగి 18 గుంటల భూమిని కలెక్టర్ పురుషోత్తంరెడ్డి, తహసీల్దార్ సుశీల సమయంలో తిరిగి షట్టర్ల నిర్మాణం కోసం అనుమతి కోరగా 2012లో అనుమతి పొందిన వారు, 2018లో పంచాయతీ అనుమతితో షట్టర్లు నిర్మించారన్నారు. అనుమతి ఇచ్చింది కాంగ్రెస్ సర్పంచ్‌లేనని ఇందులో బీఆర్‌ఎస్ నాయకులకు సంబంధం ఏంటన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, ఆచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

7న షేక్ రఫియొద్దీన్‌షా ఖాద్రీ ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలోగల హజ్రత్ షేక్ రఫియొద్దీన్‌షా ఖాద్రీ దర్గా ఉర్సు వచ్చేనెల 7న ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ బుర్హాన్ ఖాద్రీ షర్ఫీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జామీయ మసీద్ ఆవరణలో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ఉత్సవాల పోస్టర్లను హైదరాబాద్ జామీయ నిజామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ సఫీర్ అహ్మద్ నక్షబంది తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి 7 గంటలకు గంధోత్సవం, అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మతపెద్దలు

తెలిపారు. కార్యక్రమంలో షేక్ సైఫొద్దీన్ ఖాద్రీ షర్ఫీ, అహ్మద్ సనా, అబ్దుల్‌జకీ, రహెమతుల్లా ఖాద్రీ, మహ్మద్ ఇసాక్, జహంగీర్‌పాష ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క వర్గానికే కొమ్ముకాస్తే సహించం

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విరమించుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని తేల్చిచెప్పినా మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి మందకృష్ణమాదిగకు వత్తాసు పలుకుతూ కేంద్ర మంత్రిగా సరైన పద్ధతి కాదన్నారు. గతంలో ఎంతోమంది రాజకీయ నాయకులు ఎస్సీ వర్గీకరణను నెత్తిన పెట్టుకొని కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. వర్గీకరణ ప్రయత్నాలు మానుకొని దళితుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని హితవుపలికారు. సమావేశంలో కర్ణ, చెన్నకేశవులు, రాఘవేందర్, వెంకటేష్, శివకుమార్, కతలయ్య, పవన్ పాల్గొన్నారు.

భాగస్వామ్యం కావాలి

కోయిల్‌కొండ: ప్రజల భాగస్వామ్యంతోనే హరితహారం విజయవంతం అవుతుందని పంచాయతీ కార్యదర్శి రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేపట్టారు. పలు రకాల మొక్కలతోపాటు పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు అవసరమైన వాటిని తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఖాజమైనోద్దీన్, రామస్వామి, నాగరాజు, అంజి పాల్గొన్నారు.

గండేడ్: మండలంలోని చెన్నచేడ్‌లో ఇంటింటికీ పెరటి మొక్కలను సర్పంచ్ పుల్లారెడ్డి గ్రామస్తులకు పంపిణీ చేశారు. ప్రతి ఇంటిలో కనీసం 5 మొక్కలు నాటాలని అన్నారు. హరితహారంలో భాగంగా మొక్కల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.



కోయిల్‌కొండలో మొక్కలను పంపిణీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పాత ఇళ్లను పరిశీలించిన అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు పాత ఇళ్లలో నివసించే వారిపై నజర్ పెట్టారు. మున్సిపల్ అధికారులు శుక్రవారం పాతపాలమూరు, కుమ్మరివాడి, బ్రహ్మస్‌వాడి, వీరన్నపేట, మోనప్పగుట్ట తదితర కాలనీల్లో పర్యటించారు. పాత పాలమూరులో రెండు, కుమ్మరివాడిలో నాలుగు ఇళ్ల చొప్పున శిథిలావస్థకు చేరినట్టు గుర్తించారు. మరో నాలుగు పాక్షికంగా దెబ్బతిన్నట్టు తెలుసుకున్నారు. వాటిలో నివసిస్తున్న ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. కుమ్మరివాడి లోని కమ్యూనిటీ భవనంలో ఆశ్రయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో టీపీఓ లక్ష్మీపతి, చైన్‌మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి



మహబూబ్‌నగర్ రూరల్: ఎన్నికల సంఘం నియామవళి ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అర్బన్ తహసీల్దార్ పార్థసారథి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు తమ పరిధిలో ఉన్న అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తప్పులు లేని జాబితాను రూపొందించాలని సూచించారు. సమావేశంలో డీటీ రాజ్‌గోపాల్, చైతన్య, నర్సింగ్, జూనియర్ అసిస్టెంట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

బాలానగర్: కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నంగులగడ్డ తండా ఎక్వాయపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. రైతు శ్రీకాంత్ రెడ్డికి చెందిన గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 4 మృతి చెందగా, మరో 4 తీవ్రంగా గాయపడ్డాయి. వారంలో ఎక్కడో ఒకచోట కుక్కలు గొర్రెలు, మేకలు, లేగదూడలపై, కోళ్లపై దాడిచేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

మహబూబ్‌నగర్ క్రైం: పట్టణ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల పాటించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్స్ లేని 16 ద్విచక్ర వాహనాలు గుర్తించి వాటికి జరిమానాలు విధించారు.

జడ్చర్ల: నంబర్ ప్లేటు లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం జడ్చర్ల –కల్వకుర్తి ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

గ్రిల్ తొలగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని కోస్గి రోడ్డు మలుపులో ఇటీవల ఓ మాల్ సెంటర్ నిర్వాహకులు ఫుట్‌పాత్ వరకు గ్రిల్ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా ఇక్కడే రోడ్డుపై అటు, ఇటువైపు కొందరు చిరు వ్యాపారులు వివిధ పండ్లు, కూరగాయలు, ఆకుకూరల విక్రయం సాగిస్తున్నారు. దీంతో ప్రజలు, వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి గ్రిల్‌ను తొలగించడంతో పరిస్థితి సద్దుమనిగింది.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాఠశాలల స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం స్థానిక ధర్నా చౌక్‌లో స్వీపర్లు చేస్తున్న ధర్నా శుక్రవారం 26వ రోజు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో స్వీపర్లు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజు, నర్సింహులు, విజయ్‌కుమార్, జయమ్మ, రత్నమాల, వెంకటమ్మ, వెంకటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీబంధు పథకాన్ని అమలు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని పలు కమిషన్లు రిపోర్టు ఇచ్చాయని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖుబ్ అన్నారు. జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కమిషన్ల రిపోర్ట్ ఆధారంగా మైనార్టీబంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఉద్యోగాల్లో ప్రమోషన్లు, రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ రాష్ట్రంలో రుణ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీలకు రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని, సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ విద్య పటిష్టత కోసం జిల్లాలో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో మహమూద్, యూసుఫ్, అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహ్మద్ యాఖుబ్

మైనార్టీ సాయం రూ.5లక్షలకు పెంచండి

భూత్పూర్: ప్రభుత్వం మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.లక్ష సాయం సీఎం కేసీఆర్ పరిశీలనలో ఉందని మంత్రి హరీష్‌రావు పేర్కొనడం శుభసూచకమని, రూ.5లక్షలకు పెంచితే సబబుగా ఉంటుందని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్ ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. షాపులు, ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు. అడ్డాకులలో కార్మికుల సమ్మెకు రాచాల సర్పంచ్ తిరుపతయ్య యాదవ్ సంఘీభావం ప్రకటించి రూ.5వేల నగదును కార్మికులకు అందజేశారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూసీ నాయకులు రాజ్ కుమార్, వెంకటేష్ అన్నారు. ఆందోళనలో భాగంగా శుక్రవారం అంబేద్కర్‌చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

నవాబుపేట: పంచాయతీ కార్మికులు శుక్రవారం వర్షంలో మానవహారంగా నిలబడి తమ నిరసన తెలిపారు. మండల కేంద్రంలో చేస్తున్న నిరసనలో భాగంగా అంబేద్కర్ చౌరస్తాలో తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తు నిరసనకు దిగారు.

భూత్పూర్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకుడు కిల్లె గోపాల్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మున్నీకి వినతి పత్రం అందజేశారు.



మూసాపేటలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

దేవరకద్ర: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



అడ్డాకుల: మండలంలోని రాచాలకు చెందిన ఉప్పరి అశోక్‌కుమార్ ఈనెల 10న ఇంట్లో పాము కాటు వేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. మృతునికి భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబానికి సొంత ఇల్లు, భూమి లేకపోవడంతో 1999–2000 చెందిన అశోక్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.65వేలను పోగు చేసి ఇందులో రూ.10వేల నగదును భార్యకు శుక్రవారం అందజేశారు. మిగిలిన రూ.55వేలను కుమార్తె పేరున బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు వారు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని వారు కోరారు.

వార్డుల్లో పర్యటన

జడ్చర్ల టౌన్: వర్షాల కారణంగా పలు వార్డుల్లో చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహమూద్‌షేక్ పర్యటించారు. 17వ వార్డులో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను పరిశీలించారు. వాల్మీకినగర్‌లో ఒక ఇంటిని పొక్లెయిన్ సాయంతో కూల్చివేయించారు. 26వ వార్డు పెద్ద మోరిని పరిశీలించి పొక్లెయిన్ సాయంతో మట్టిని తొలగింపజేసి వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. 7వ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని 10వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి రాజు, బీజేపీ నాయకులు వారి దృష్టికి తీసుకువెళ్లటంతో అక్కడ సందర్శించి పొక్లెయిన్ సాయంతో మట్టిని తొలగింపజేశారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ సూచించారు. ఏరియా ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రోడ్డు దెబ్బతినగా సూపరింటెండెంట్ సోమశేఖర్, కౌన్సిలర్ సతీష్‌కు సమాచారం అందించగా చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ మహమూద్ షేక్ పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పైపులు వేయించి రాకపోకలు పునరుద్ధరిస్తామని తెలిపారు. అప్పటి వరకు 167వ నంబర్ జాతీయ రహదారి పక్క నుంచి ఆస్పత్రికి వెళ్లే మరో రోడ్డును వినియోగించాలని కోరారు.

మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంజీవ్, లక్ష్మణ్‌యాదవ్, బెక్కరి అనిత, సిరాజ్‌ఖాద్రీ, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, రమేష్, ఫయాజ్, అజ్మత్‌అలీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. పాతపాలమూర్ 11వ వార్డులో నాయకులు కేక్‌కట్ చేశారు. దళితుడిని ఏఐసీసీ అధ్యక్షులుగా నియామకం చేసి కాంగ్రెస్ పార్టీ దళిత పక్షపాతి అని మరోకసారి నిరూపించిందన్నారు. కార్యక్రమంలో చంద్రకుమార్‌గౌడ్, సాయిబాబా, అబ్దుల్ హక్, అబ్రార్, లక్ష్మణ్, వేణు, కుర్మయ్య, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

నవాబుపేట: అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాలతో గ్రామాల్లో నీటి నిల్వలు ఎక్కువై మురుగు నిలుస్తుందని, వాటి మూలంగా దోమలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలందరికి ఆరోగ్య సూత్రాలు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు.